పదిహేను రోజులపాటు యెవరూ యెటువంటి నేరాలు చేయకుండావుంటే పోలీసుశాఖ ఏం కావాలి ?

"ఇందాక భూదేవి వచ్చింది మన కొండకి" యాధాలావంగా అన్నట్లు చెప్పింది పార్వతి.

# మూడో కన్ను

ప్రసన్నకుమార్ సర్రాజు



శివుడు వినిపించుకోలేదు, కిందకు చూస్తున్నాడు. పచ్చగా పొలాలు మధ్యమధ్య సెలయేళ్ళు. "భూమి చాలా బాగుంది" అనుకున్నాడు.

పార్వతి శివుడివంక చూసింది. "విన్నారా నే చెప్పింది?" చిరు కోపంతో అంది. శివుడు ఉలిక్కిపడి, "ఆఁ ఆఁ విన్నాను. భూదేవి వచ్చిందన్నావుగా! ఏమంది?" అడిగాడు పార్వతివేపు తిరిగి.

మళ్ళీ మామూలుగా అయిపోయి. "పాపం చాలా జాలేసిందండీ, చాలా దిగులుగా కనిపించింది" అంది పార్వతి.

"ఏమిటి సంగతి?" కుతూహలంగా అడిగాడు శివుడు నంది వేగం తగ్గించి చెవులు రిక్కించుకుంది.

"భూలోకంలో పాపాలు, నేరాలు ఎక్కువై పోతున్నాయట. ఈ భారం నేను మొయ్యలేను బాబోయ్ అని కళ్ళమ్మట నీళ్ళెట్టుకుంది."

మామూలుగా అన్నాడు శివుడు: "మరి కలియుగం అన్నాక తప్పదుగదా! కృతయుగంలోనూ, త్రేతాయుగంలోనూ హాయిగా వుండలా? ద్వాపరయుగం దాకా ఫరవాలేదు. అయినా మనకి వచ్చి చెప్తే మనమేం చేస్తామట!"

"అలా అంటే నశిపోతుందా? నేను మాటిచ్చాను" అలుకగా అంది పార్వతి.

శివుడికి నచ్చలేదు. పార్వతి వ్యవహారం. "ఇలా అందరి వ్యవహారాల్లోను తల దూర్చటం మంచిదికాదు పార్వతీ. బ్రహ్మనిచూడు దేన్లోనైనా తలలు దూరుస్తాడా? అక్కడికీ వొకసారి తగుదునమ్మా అని దూరిస్తే ఒక తలే యెగిరిపోయింది. ఎవళ్ళ కష్టాలు వాళ్ళకుంటయ్. నేనువిషం మింగినప్పుడు యెవరొచ్చారు మనకి సహాయం?" కాస్త చిరాగ్గా అన్నాడు.

పార్వతి మనసు కష పెట్టుకుంది. మాట్లాడకుండా అటుతిరిగి, నంది కొమ్ము మీద చిన్నగావేలితో కొడుతూ కూర్చుంది.

శివుడికి కష్టం వేసింది. చాలాకాలం అయింది, ఇలా సతీ సమేతంగా బయలుదేరి.ఇప్పుడేమో ఇదేదో ఉపద్రవం వచ్చిపడింది. ఏమిటో అని నిట్టూర్చాడు.

"అలా కస్సుబుస్సు లాడక్కర్లా.... ఇష్టంలేదని చెప్పొచ్చుగా!" పార్వతి చీత్కారమాడింది

"నేను కాదు బుస్సుమంది....ష్.... ఊరుకో నాగరాజూ" అని మెడలో పాముని కసిరి, "ఇంతకీ ఏమంటావు పార్వతీ!" అన్నాడు సాధ్యమైనంత అనునయంగా

"ఏంలేదు భూమ్మీద నేరాలు, పాపాలు లేకుండా వరం ఇవ్వండి" అంది.

శివుడు కాస్త ఆలోచించాడు. తను కాదుకూడదు అంటే ఇక తర్వాత పార్వతి అలుకను భరించలేడు. ఎలాగో అలా ఈ గడ్డుపరిస్థితిని దాటాలి

"చూడు పార్వతీ! ఏ యుగధర్మం ఆ యుగానిది. దాన్ని మార్చటం ఆ త్రినేత్రుడికి కూడా. అదే-త్రిమూర్తులకి కూడా సాధ్యం కాదు. అయినా నువ్వడుగుతున్నావు గాబట్టి. ఒక్క పదిహేను రోజులు మాత్రం భూమి మీద, అదికూడా భారతదేశంలోనే ప్రజలు ఎటువంటి నేరాలూ చెయ్యకుండా వరం ఇస్తాను. కానీ దీని మూలాన చాలా అనర్థాలొస్తాయి అరాచకం ప్రబలుతుంది. అంతా అల్లకల్లోలమైపోతుంది."

"నేరాలు లేకపోతే అల్లకల్లోలమా? మీరు గమ్మత్తుగా మాట్లాడుతున్నారు."

"అరాచకం ప్రజల్లోకాదు- ప్రభుత్వంలో. అయినాసరే నీ తృప్తికోసం వరం ఇస్తున్నాను. పరిణామం నువ్వే చూస్తావు. ఇప్పటినుంచి ఒక పక్షం రోజులపాటు ప్రజల్లో ఎటువంటి నేరచింతనా లేక యెంతో సచ్ఛీలంతో వుంటారుగాక" అని శివుడు వరం యిచ్చేశాడు.

పార్వతి సంతోషపడింది.

* * *

ఆ క్షణంనుంచీ భారతదేశంలో ఆ వర ప్రభావం కనిపించింది. ఐదు వేల రూపాయల పర్సు రోడ్డుమీద యెవరైనా ఆ సామీ పోగొట్టుకుంటే నోట్లు రెపరెపలాడుతూ బయటకు కనిపిస్తున్నా, దారే పోయేవారు దానివంక కన్నెత్తి కూడా చూడటంలేదు. చూసినా "పాపం యెవరు పోగొట్టుకున్నారో వారే వెతుక్కుంటూ వచ్చి తీసికెడతారులే" అని ఎవరి పనిమీద వారెళ్ళి పోతున్నారు.

అందమైన అమ్మాయి దారితప్పి ఒంటరిగా, నిర్జన ప్రదేశంలో రాత్రిపూట కనిపించినా, ఆ అమ్మాయిని జాగ్రత్తగా తీసికెళ్ళి భద్రంగా వాళ్ళింట్లో అప్పచెప్తున్నారు కుర్రకారు.

ఒక దెబ్బలాటగానీ, ఓ ముఠా తగాయిదా గానీ, ఒక కత్తిపోటు సంఘటనగానీ త్రాగి లారీ నడిపి ఒక యాక్సిడెంటు చెయ్యడంగానీ లేదు. ఒక మోసంలేదు. ఒక వాగ్యుద్ధంలేదు దేశం (సు)భిక్షంగా వుండటానికి శివుడు వరమిచ్చిన మొదటి రోజు ప్రారంభమయింది.

వాలి చిత్రకూట పర్వతంపైకి రాలేనట్లు శివుని వరంకూడా కేవలం సివిలియన్సుకే పరిమితమైంది.

కాకీ నిక్కర్లు, పాంట్లు వేసుకునే ప్రభుత్వ రక్షకభటులనుమాత్రం ఏమీ చేయలేకపోయింది.

శివుడు వరం కేవలం ప్రజలకే పరిమితం అన్నాడుగదా. అంటే పోలీసులు ప్రజలు కారు. ఆ జాతివేరు. ఈ జాతివేరు.

THE INSTITUTE OF ENGLISH STUDIES
LANGUAGES are LIGHT HOUSES whose luminous BEAMS guide VOYAGING in the OCEAN of EDUCATION
ఆంగ్ల భాషాబోధక సంస్థ,
3, మొదటి మెయిన్‌రోడ్డు, లేక్ ఏరియా,
నుంగంబాకం, మదరాసు-600 034
(వళ్లువరుకోట్టము ప్రక్క)
16 ఏండ్ల వయస్సునకు పైబడినవారు
అధికపక్షము
ఒక సంవత్సరములో
ఆంగ్లములో
సంభాషించుటకును,
పరిచయముచేసికొనుటకును
తపాలా ద్వారా
విశ్రాంతి సమయములో
ప్రారంభమునుండి కాని -
లక్ష్యలక్షణ
పరిశోధన పద్ధతిలోకాని
ఇంగ్లీషు
నేర్చుకోవచ్చును.



నా మాతృభూమి యొక్క దక్షిణాగ్రములో, అలలతోనిండిన నీలసముద్రపు ఒడ్డులో, తల్లిగా అవతరించి, శిల్పిహస్తములగందని సింగారమగువా! సౌందర్యవంతమైన రంగుల శిల్పమా! తపస్సులోనున్న కరుణారూపమా! కన్యాకుమారీ!
స్వామి వివేకానందుడు. మీ ముందున్న సముద్రపుగట్టులో తపస్సుచేసినది మాకు తెలియును
మీపై మిణుకుమిణుకుమని తారలను మించి ప్రకాశించు వజ్రము, మా ఆప్తులు తప్పకఒడ్డుచేరుటకు మార్గదర్శి చరిత్ర మాకు తెలియును.
అదే విధముగా, ఇప్పటివలె కళాశాలయొక్క ఉచ్ఛస్థితిని చూచుటకు ఆంగ్లభాష మార్గదర్శి.
ప్రారంభమునుండి క్రొత్త తరగతులగూర్చి నేరుగా వచ్చికాని, 25 పైసల తపాలాబిళ్లతో లేఖవ్రాసికాని పూర్తి వివరములను తెలిసికొనండి.
వెంటనే చేరండి.
చేరుటకై దరఖాస్తు చేయుటకు ఆఖరు తేదీ లేదు. పూర్తి వివరములకును వెంటనే లేఖను వ్రాయండి.
G. SHANMUGASUNDARAM, Principal

రెండవ రోజు సాయంత్రం 6-00 గం

ఎస్సై పుస్సుంటూ కుర్చీలో కూలబడ్డాడు. హెడ్డుని కేకేసి, రికార్డు పట్టుకు రమ్మని చెప్పి, విశ్రాంతిగా కళ్ళు మూసుకున్నాడు.

"సార్" అని వినిపించగానే కళ్ళు తెరిచి చూశాడు.

హెడ్డు, రైటరు ముసిముసిగా నవ్వుతూ నిలుచున్నారు.

"ఏమిటి? ఏమయింది? ఆ నవ్వేమిటి?" అన్నాడు చిరాగ్గా.

"పోలీసుల మొహంమీద చిరునవ్వు అచ్చిరాదు" అని వాళ్ళ తాత పోతూపోతూ చేసిన హితబోధ యెప్పుడూ జ్ఞాపకం వుంటుం దతనికి. ఆయన హెడ్డుగా రిటైరై తనకి పోస్టింగొచ్చిన మర్నాడే పోయాడు. ఆయనకి బంగారప్పళ్ళుండేవి. డూటీ దిగాక యింటికెళ్ళి, ఒంటరిగా గదిలో అద్దంముందు నిల్చుని, చిరునవ్వు నవ్వుకుని, ఓ పదినిముషాలు పోయాక చేత్తో మొహం తుడుచుకుని తలుపులుతీసి బయటికొచ్చేవాడు. అలా రోజూ పొద్దున్నా, సాయంత్రం రెండు పూట్లా దంతక్షయం రాకుండా కాపాడుకునేవాడు

"ఏంలేదు సార్ మీరు నిన్నా ఇవ్వాళా రాలేదుగదా! ఈ రెండు రోజులూ ఒక్క కేసు కూడా లేదండీ. రికార్డులు ఖాళీ" అన్నాడు రైటరు.

"ఎరవనాయాళ్ళంతా మంచోళ్ళయి పోయారు ఈ రెండ్రోజులూ" అన్నాడు హెడ్డు.

ఎస్ ఐ మొహాన రిలీఫ్ కనిపించింది. తను లని సమయంలో ఎవడు చచ్చాడో, ఎవడింట్లో లూటీ జరిగిందో అని భయపడుతూ వచ్చాడు స్టేషన్ కి. అమ్మయ్య ప్రాణం హాయిగా వుంది.

ఎస్సైగారిమొహంలో ప్రశాంతతచూసి రైటరూ, హెడ్డూ ఉల్లాసంగా వెళ్ళిపోయారు సన్నగా ఈలేసుకుంటూ.

పైన నంది చిన్నగా చిరు రంకె వేసుకుంది వాళ్ళను చూసి.

మూడవరోజు రాత్రి 10 గం॥

ఎస్సై మార్కెట్ ఏరియా దగ్గర మోటారు సైకిల్ మీద వెడుతున్నాడు. అతనికి ఆ సమయంలో కళ్ళు బైర్లు కమ్మినట్లయింది. అసంకల్పితంగా మోటార్ సైకిల్ ఆగిపోయింది. కలా నిజమా అనుకున్నాడు.

అంతదూరంలో ఝుకోటేగాడూ, బతాణీగాడూ, చెట్టాపట్టా లేసుకుని కబుర్లు చెప్పుకుంటూ వన్ బై టూ మొక్కజొన్న కండె తింటూ వెడుతున్నారు. మధ్యమధ్య పెద్దగా నవ్వుకుంటున్నారు. వాళ్ళిద్దరూ పచ్చికేడీలు. అదికాదు ఆశ్చర్యం.... వాళ్ళ మధ్య పచ్చగడ్డివేసి చలిమంట కాచుకునేవారు చిన్నసైజు రౌడీలు. వాడూ వీడూ ఎన్నోసార్లు పొడుచుకున్నారు కూడా. అటువంటిది.

ఎస్సై నెమ్మదిగా బైక్ స్టార్ట్ చేశాడు. మరి మూడురోజుల్నించీ ఏ కేసూ రికార్డు కెక్కలేదంటే ఎలా యెక్కుతుంది?



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ ఎస్ మునుస్వామి నాయుడు కుమార్తె చి॥ సౌ॥ శిరీషా బి. ఎ., చి॥ డా॥ ప్రభాకర్ ఎమ్ బి. బి.ఎస్. ల వివాహం ఇటీవల తిరుమలలో జరిగినప్పటి చిత్రం

ఇలాంటి విచిత్రాలు జరుగుతూంటే? హుం.... కలికాలం అనుకున్నాడు.

స్టేషన్ కి వెళ్ళగానే నైట్ డ్యూటీ సెంట్రీ చెప్పాడు. సి. ఐ. గారు ఫోను చేశారని: ఇప్పుడుగానీ రేప్పొద్దునగానీ కలవమన్నారని.

ఎస్సై ఝుకోటేగాడి గురించి, బతాణీగాడి గురించీ ఆలోచిస్తూ తల వూపాడు

నాలుగో రోజు ఉదయం 10 గం॥

"ఇలాగయితే ఎలాగయ్యా! నేరాలు లేవని నువ్వు చెప్తున్నావ్ సరే- నేనూ నమ్ముతాను నీ మాట. నువ్వేకాదు. నా సర్కిల్ లో వున్న ఎస్సైలందరూ అలాగే చెప్తున్నారు. కానీ దొరగారడిగితే ఏం సమాధానం చెప్పాలి? నువ్వే చెప్పు. నాలుగు రోజుల్నించీ ఒక్క కేసు కూడా రికార్డు కెక్కలేదంటే నా పరువేమన్నా నిలుస్తుందా? పోలీసు డిపార్టుమెంటుకి ఎంత అప్రదిష్ట?" సి. ఐ. చీవాట్లు పెడుతున్నాడు.

"నాకూ ఆశ్చర్యంగానే వుంది సార్" ఎస్సై నీళ్ళు నమిలాడు.

"అంతా కల్పి కూర్చొని తీరిగ్గా ఆశ్చర్యపడదాం. అశ్రద్ధ చెయ్యకుండా వర్క్ చెయ్యి. నీ సబార్డినేట్సందర్నీ యాక్టివేట్ చెయ్యి. రేపటికల్లా ఎప్పటిలా కేసులు రికార్డుకెక్కాలి." అంటుండగా ఫోను మోగింది. సి.ఐ. ఫోనెత్తి, అవతలి స్వరం విని నిరారుగా అయిపోయాడు. కాస్సేపు విని, "అలాగే సార్ ఇప్పుడే బయలుదేరుతున్నాను" అని ఫోనుపెట్టేసి, "ఏ ఎస్పీ గారుపిలుస్తున్నారు. మీమూలాన ఇవ్వాళ నాకు చీవాట్లు" అంటూ విసుక్కుని హేటు తీసుకుని బయటికెళ్ళిపోయాడు.

* * *

"వాట్ నాన్సెన్స్ ఆర్ యూ టాకింగ్? వేళాకోళాలకి సమయం వుంటుంది నాలుగు రోజుల్నించీ ఖాళీ రికార్డులు పంపిస్తూ పైగా అంతా మంచోళ్ళయిపోయారంటారా? దిసీజ్ టూ మచ్. అలవెన్సులు మాత్రం టంచన్ గా యివ్వాలని డిమాండ్. మళ్ళా కేసుల జోలికి మాత్రం వెళ్ళకూడదు. ఎంతసేపూ ఈలపాట పాడుకుంటూ కూర్చోవాలి రఘురామయ్యలాగా."

"ఎస్ సార్...." ఒక సి. ఐ. ఏదో చెప్పబోతున్నాడు.

"వాట్ ఎస్ సార్? కానిస్టేబుల్సందరి దగ్గరా విజిల్స్ లాగేసుకోండి. ఐ వాంట్ రిజల్ట్స్ క్విక్" ఏ.ఎస్పీ. గట్టిగా మాట్లాడుతున్నాడు.

టూ టౌన్ లో వున్నాడు ఏ ఎస్పీ. ఆయన యెదురుగా నలుగురు సి.ఐ.లు కూర్చునివున్నారు ముఖంగంటుపెట్టుకుని.

ఫోను మోగింది. ఇన్‌స్పెక్టర్లు మొహాలు చూసుకున్నారు. ఆ ఫోను ఎక్కడినుంచో ఊహించారు. ఇంకెవరు? డీఎస్పీగారే అయుంటారు. ఏ.ఎస్పీ. ఫోనెత్తాడు.

"ఎస్ సార్. అవునండీ. ఇప్పుడే అందరూ వచ్చారు. గట్టిగా అడుగుతున్నాను అలాగే.... అలాగే సార్.... ఐదు నిమిషాల్లో మళ్ళీ ఫోను చేస్తారా? ఈలోపల డిస్కస్ చేసి మీకు చెప్తాను సార్. ఆ.... ఉంటానండీ" ఫోను పెట్టేసి రుమాలుతో మొహం తుడుచుకున్నాడు.

"ఫైరుమీదున్నాడు" గొణుక్కున్నాడు.

"ఊఁ.... ఐదు నిముషాల్లో చెప్పాలి.... వాటార్ యూ గోయింగ్ టు డూ?"

ఒక సి ఐ. గొంతు సవరించుకున్నాడు. ఏవరంతటినీ ఫోర్సులో పెడదాం సార్. ప్రతి సెంటర్నీ, ప్రతి కార్నర్‌నీ కేర్‌ఫుల్‌గా చెక్ చేయిద్దాం. నేరాలు మన దగ్గరికి రాకపోతే మనమే వెతుక్కుంటూ వెడితే అవే దొరుకుతయ్యి."

"గుడ్.... తర్వాత?"

రెండో సి ఐ. చెప్పాడు. "ప్రతి చిన్న కేసునీకూడా నిర్లక్ష్యంగా వదిలిపెట్ట వద్దని ఆజ్ఞలు జారీ చేద్దాం సార్. ఈవెన్ డబుల్స్ కేసూ, లైటు లేని కేసూ కూడా పట్టుకుంటే మంచిదని నా అభిప్రాయం"

"ఊఁ. ఇంకా?"

"కత్తులూ, కత్తెరలూ. బ్లేడ్లయినాసరే ప్రొసెషన్‌లో వున్నవాళ్ళని అనుమానం కింద కష్టడీలోకి తీసుకుంటే" ఒక సి ఐ. చెప్పాడు

"అదొద్దు. అలా అయితే బార్బరుషాపులన్నీ మూతపడతయ్యి. ఇంకా యేదైనా చెప్పండి"

ఫోను మోగింది. వెంటనే ఎలర్ట్ అయిపోయాడు. ఏ ఎస్పీ. వినయంగా ఫోనెత్తి "ఎస్ సార్. ఏమిటి? నెంబర్ ఫిఫ్‌ఫోరా? ఇప్పుడే కనుక్కుంటా సార్" అని మౌత్‌పీస్‌మీద చేత్తో మూసి. "నెంబర్ ఫిఫ్‌ఫోర్ ఎప్పుడు వచ్చేదీ అడగమన్నారు. క్విక్. అసలు ఇవ్వాళ డ్యూటీలో కొచ్చాడో లేదో కనుక్కోండి ముందర" అని ఆజ్ఞలిచ్చాడు.

వెంటనే ఒక సి. ఐ. హడావుడిగా లేచాడు.

ఈలోపల ఏ.ఎస్పీ. మళ్ళీ ఫోనులోకి తిరిగి "ఇప్పుడే కనుక్కుం.... వాట్? ఎంత లేటా? ఏమిటీ? ఎవరు మాట్లాడేది? యూ స్టుపిడ్.... ఫిఫ్‌ఫోర్ ఎక్స్‌ప్రెస్ ఎంత లేటని నన్నడుగుతున్నావా.... హౌ డేర్ యూ- ఇది రైల్వేస్టేషననుకున్నావా? బ్లడీ ఇది పోలీస్‌స్టేషన్ పెట్టేయ్ ఫోను పెట్టేయ్" బొందులు వేస్తున్నాడు.

ఈ లోపల బయటికెళ్ళిన సి. ఐ వచ్చి చెప్పాడు స్మార్ట్‌గా. ఫిఫ్‌ఫోర్ ఇవాళ రెండుగంటలు లేటుగా వస్తానని కాగితం రాసిపెట్టాడుట సార్...."

ఏ ఎస్పీ ఫోను పెట్టేసి గుర్రుగా చూశాడు సి ఐ. వంక. మిగతా సి. ఐ.లు నేల చూపులు చూస్తూ రుమాలుతో మూతి తుడుచుకుంటున్నారు-

"నౌ. యూ కెన్ గో. ఐ వాంట్ రిజల్ట్స్ యిమీడియేట్‌లీ" అని ఏ ఎస్పీ. చెప్పగానే వెంటనే లేచి సెల్యూట్ చేసి వెళ్ళిపోయారు.

ఆ సాయంత్రం స్థానిక దినపత్రిక డాక్ ఎడిషన్‌లో ప్రత్యేక విలేకరి సమాచారం ప్రచురించింది.

దేశం సుభిక్షమైపోతోందా?

గత నాలుగైదు రోజులుగా నగరంలో యెక్కడా యేవిధమైనటువంటి నేరాలూ లేవని, ఆ నోటా, ఈనోటా అనుకుంటున్న విషయం నిజమేనని, నగరంలో శాంతి భద్రతలు వెల్లివిరుస్తున్నయ్యని ఇది తనకెంతో ఆనందం కలిగిస్తున్నదని ఏ. ఎస్పీ. గారు మా ప్రవి.కి చెప్పారు.

ఈ మాట చెప్తున్నప్పుడు ఆయన చాలా ఉల్లాసంగానూ హుషారుగానూ కనిపించారనికూడా ప్ర. వి. రాశాడు.

అదిచదివి ఏ.ఎస్పీ. తనసబార్డినేట్సందరినీ మళ్ళీ తిట్టుకున్నాడు కేసులు లేవని పోలీసు డిపార్టుమెంటు అట్టుడికిపోతోందని ఆ పత్రికా విలేకరిని టిప్ చేసినవాడెవడు? ఇలా డిపార్టుమెంటు రహస్యాలన్నీ పత్రికల కెక్కిస్తే డిపారుమెంటు పరువేమైపోను? ఆ విలేకరి జిడ్డులా పట్టుకుని ప్రాణాలు కొరికేస్తూంటే తను ఒప్పుకోక తప్పిందికాదు సాధ్యమైనంతవరకూ యెటువంటి చికాకునూ కనబర్చకుండా నటించాడు హు. ఎంత గడ్డు పరిస్థితి? యెల్లుండి యెస్పీగారితో మీటింగుంది.

ఐదవ రోజు

"కేసొచ్చింది కేసొచ్చింది" ఆనందంగా అర్చాడు రైటరు అతనీ రైటరు పుద్యోగంలో చేరినప్పటినుంచీ ఏదో ఒకటి రాస్తూనేవున్నాడు గత కొద్ది రోజులుగా అసలు రాయటమేలేదు ప్రొద్దున హెడ్డూ, సార్జంటూ తనగురించి ఏదో చెప్పుకుని చిన్నగా నవ్వుకోవటం గమ


## క్లాసులు ప్రారంభమైనవి

*1980 ఫిబ్రవరి 23, 24 తేదీలలో*

6వ తరగతి లోనికి ప్రవేశ పరీక్షలు జరుగును

## సైనిక స్కూలు; కోరుకొండ (A.P.)

బాలుర వయస్సు 1980 జూలై 1వ తేదీ నాటికి 10-12 సం॥ల మధ్య నుండవలెను డిఫెన్సులోని, ఎక్సు సర్వీసు ఉద్యోగుల పిల్లలకు మరియు షెడ్యూలు కులముల వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కలవు

కోరుకొండ సైనిక స్కూలుతో సమానంగా ప్రారంభించి చక్కటి హాస్టలు వసతితో పై పరీక్షకు ఇంగ్లీషు. తెలుగు మీడియంలో శిక్షణ నిచ్చుటలో పేరెన్నిక గన్న దక్షిణ భారత దేశమునందలి ప్రప్రథమ విద్యాసంస్థ.

ఫోన్ : 22084



## శ్రీ విద్యా విహార్

"ఆదర్శ గురుకుల విద్యాసంస్థ"

లలితానంద నగర్, రింగురోడ్డు, గుంటూరు-6.

ప్రతి సంవత్సరం అత్యుత్తమ ఫలితాలకు, సైనిక స్కూలులో చదువు వందలాది మా విద్యార్థులే మీకు నిదర్శనం ఇంకనూ ఇతర కోర్సులు, నర్సరీ నుండి మెట్రిక్ వరకు కలవు.

వించాడు తను. వాళ్ళ మాటలు స్పష్టంగా వినపడలేదుగానీ, తన గురించి రాయని భాస్కరుడు అయిపోయాడు అని అను కోవటం మాత్రం బాగా వినిపించింది హుం! ఇవ్వాళ ఒక్క కేసైనా రాయకపోతే ఇక కలం పట్టనని ప్రతిజ్ఞ చేసుకున్నాడు

ఎదురుగా ఒక కోడిపెట్టను ఇబ్బందిగా చేతిలో పట్టుకుని వస్తున్నాడు అవధాని అవధాని కానిస్టేబుల్ డ్యూటీ సరిగానే చేస్తాడుగానీ, శాకాహారి అనీ, బొత్తిగా పాపభీతి కలవాడనీ సెంటిమెంట్లు ఎక్కువనీ పెద్ద పేరుంది సర్కిల్‌లో. అతని ప్రక్కనే ఒక మీసాల ఆసామీ వున్నాడు

వాళ్ళు దగ్గరికి రాగానే రైటర్ పుస్తకం తీశాడు.

"రా నాయనా రా! ఏ వూరు మంది?" అడిగాడు.

"చిత్తం ఎర్రగుంటండి" చెప్పాడు ఆ వ్యక్తి.

"ఏ పేరు మంది?"

"ఎర్రయ్యండి."

"ఇల్లెక్కడ?"

"ఎర్ర కాలువ దగ్గరండి"

రైటర్ విసుగ్గా చూశాడు. "ఎర్రా ప్రగడ ఏమౌతాడు మనకి?"

"ఏం కాడండి"

"ఇప్పుడు చెప్పు. ఎందుకు దొంగిలించావ్ కోడిని?"

"కోడినా? మా ఎర్రకోడిని నేను దొంగిలించట మేంటండీ?"

"నువ్వు కాకపోతే ఎవడు దొంగిలించింది? పైగా ఆ కోడి నీదేనంటావా?" కళ్ళెర్రచేశాడు రైటర్.

"అలా ఎర్రగా చూస్తే భయమనుకున్నారేంటండీ?"

అవధాని చేతిలో కోడి విశ్వప్రయత్నాలు చేస్తోంది. గోలగోల చేస్తోంది. దాన్ని పట్టుకోవటానికి నానాఅవస్థాపడుతూ ఏదో చెప్పటానికి ట్రై చేస్తున్నాడు అవధాని.

"అసలు ఎర్ర టోపీని సూస్తేనే నాకు మాసెడ్డ సిరాకండి. నేనేం నేరం సేసానండి? నన్నటు కొచ్చాడే, ఆ ఎర్రటాయన ఆయనన్నడగండి."

"కొక్కొక్కొ-కొక్కొక్కొ-కొక్కొక్కొ" కిందపడి అటూ, యిటూ పరుగుతున్న కోడినిపిలుస్తూ అలంగం తిరుగుతున్నాడు అవధాని.

"అవధానీ" కేకేశాడు రైటర్. ఎస్సై బయటి కెళ్ళాడు. ఆయనొచ్చేలోగా తనే కేసుని రిజిస్టర్ చేసి మెప్పుపొందాలని తపన.

"ఈ ఎర్రగుంట ఎర్రయ్యంటే నాలుక్కోసినా అబద్దం సెప్పడండి. మీరే సూడండి" అని "మాలచ్చీ.... భోభోభో.. మాలచ్చీ.. భోభోభో" అని పిలిచాడు వెంటనే వచ్చి, ఆసామి భుజంమీద వాలింది కోడి.

"ఇప్పటికైనా నమ్ముతారా?" కోడిని ప్రేమగా నిమురుతూ అన్నాడు ఆసామి.

రైటర్‌కి పెన్నులో రీఫిల్ తీసేసినట్లయింది అవమానంతో. అవధానివంక తిరిగి కోపంగా "ఏమిటి గోల?" అని అరిచాడు.

"ఇతను కోడిని దొంగిలించలేదండీ"

"మరేం చేశాడయ్యా?"

అవధాని గొంతు మారిపోయింది. శూన్యంలోకి చూస్తూ విషాదంగా చెప్పాడు: "హుం! తల్లినీ, బిడ్డనీ వేరు చేయటమే కాక, తల్లి ఎదుటే బిడ్డని కోసి ఆహారంగా వండి పెట్టడం పాపం కాదా సార్?" అతని గొంతు గద్గదమైంది.

రైటరు కూడా చలించిపోయాడు. "అవధానీ ఇంత ఘోరం చేశాడా వీడు? బిడ్డని మర్డర్ చేసి బలవంతాన తల్లి చేత తినిపించటం చాలా దారుణం. మరి యింత తేలిగ్గా చెపావేమయ్యా! మర్డర్ కేసయితేనూ? ముందర వీణ్ణి బొక్కలోకి తొయ్ ఎస్సైగారొచ్చాక విచారిస్తారు" అన్నాడు.

"ఓసోస్. నా కోడి పుష్టిగా వుండాలని నాకుంటుంది. నా మాలచ్మికి ఆమైట్టు పెట్టుకుంటాను. గుడ్లు పులుసు పెటుకుంటాను. నా ఇష్టం. నన్ను మర్డర్ కేసులో ఇరికించాలని చూస్తున్నారేమో. ఎర్రని ఏగానీ ఖర్చెట్టకుండా బయట కొస్తాను ఏటనుకున్నారో" ఆసామి అరుస్తున్నాడు.

రైటర్‌కి విషయం అర్థమయింది.

అవధానీ! నువ్వూ నీ సెంటిమెంట్లు తగలడ. తిట్టుకుంటున్నాడు కసిగా....

ఆరో రోజు

"ఇంత అలక్ష్యంతో మన డిపార్టుమెంటు వ్యవహరించటం నా సర్వీసులో నేనెప్పుడూ యెరగను. ఇలా అయితే ప్రజల్లో మనకేమైనా విలువుంటుందా? ఎల్లుండి రాజధానిలో హై అఫీషియల్స్ కాన్ఫరెన్స్ వుంది నేను. వాళ్ళకేం సమాధానం చెప్పను? ఎప్పుడు డి. ఐ. జి. గారొస్తారో ఏం చెప్పాలాఅని నేను మధన పడుతూంటే మీకు చీమ కుట్టినట్లయినా లేదు. గూండాలంతా యేమయ్యారు? కేడీలు, రౌడీలు తీర్థయాత్రలకి పోయారా? ఇంత అసమర్థులైన వాళ్ళని నా సబార్డినేట్స్‌గా పెటుకొని నేనెలా చావను? మీకు చేతకాకపోతే రిజైన్ చేయొచ్చుగా?" ఎస్పీ మాటలు మర్యాదగానే మాట్లాడుతున్నా అవి తిట్లని, ఏ ఎస్పీలకి, డీవైఎస్పీకి తెలుసు మౌనంగా వింటున్నారు.

"మీకు మూడురోజులు టైం ఇస్తున్నాను. ఎప్పటిలాగా మన డిపార్టుమెంటు పనిచేస్తూ కేసులు రిజిష్టర్ చెయ్యకపోతే జిల్లాలో శాంతి భద్రతలు కరువైనట్లే భావించాల్సొస్తుంది. ఆ పరిస్థితే ఉత్పన్నమయితే అదనపు పోలీసు బలగాన్ని, అవసరమైతే ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌నైనా పిలిపించాల్సిన అగత్యం ఏర్పడుతుంది. అంత అల్లకల్లోలం కాకమునుపే ఆ పరిస్థితి రాకుండా జాగ్రత్తపడతానని ఆశిస్తాను" అని లేచాడు ఎస్పీ- సమావేశం అయిపోయిందని సూచిస్తూ.

తర్వాత డీవైఎస్పీ సిఐలని. సిఐ.లు ఎస్సైలని, ఎస్సైలు కానిస్టేబుళ్ళని, ఎవళ్ళ లెవల్లో వాళ్ళు తిట్టారు. మూడు రోజుల్లో కేసులు పట్టుకోకపోతే క్షమించేది లేదని హెచ్చరించారు.

ఎనిమిదో రోజు

"ఈ ప్రజలంతా మరీ మంచోళ్ళయిపోయారు" విసుక్కున్నాడు హెడ్ కానిస్టేబుల్ సింహం. బొత్తిగా కేసుల్లేక అలా టీ తాగొద్దామని హోటలు కెళ్ళి కూర్చున్నాడు హెడ్డు. రైటరు.

"బొత్తిగా సెడిపోయారు. మరీ ఇంత అతి వినయం వొచ్చేసిందేంటి ఈళ్ళకి?" రైటరు ఆశ్చర్యపోయాడు

సర్వరుకి రెండు టీ ఆర్డరు చేసి, రేడియోలో శ్రోతలుకోరినపాటలు వింటూ కూర్చున్నారు. ఇదివరకు ఫలానా పాట కోరినవారు ఫలానా వూరినించీ నందన, వందన, చందన, మదన వారి మిత్ర బృందం, ఫలానా వూరినించీ కళ్యాణి, శర్వాణి, తర్వాణి గీర్వాణి, ఇంకాఫలానా వూరినుంచిమధుబాబు, రవిబాబు, బుచ్చిబాబు, లచ్చిబాబు, అచ్చయ్యచంగయ్య, మల్లయ్య, యానయ్య, గురవయ్య అంటూ లిష చదివేవారు. యిప్పుడు వొకళ్లో యిద్దరో పేర్లు యింటి పేరుతో సహా చదువుతున్నారు.

"ఈళ్ళుగూడా యింత మంచాళ్ళయిపోతే ఎలా సచ్చేది?" అనుకుంటూండగానే అదేదో సినిమా పాట ఒరిజినల్ స్పీడుకంటే యెక్కువ స్పీడు వేసేశారు. అలా ఓ నిముషం పోయాక తప్పు తెలుసుకుని మామూలుగా వేశారు. పాటయిపోయాక వెనువెంటనే చిన్న రోదన లాంటిది వినపడింది రేడియోలో. అది క్రమంగా పెద్దదయింది. చాలా మంది కలసి ఏడుస్తున్న ధ్వని.

"ఎవరైనా పోయారేమో పావం- నాయకుడుగానీ...." అని రైటరు అం

టూండగానే రేడియోలో ఎనౌన్సర్ గొంతు వినిపించింది భారంగా.

"ఈ కార్యక్రమంలో ఇంతకుముందు. శ్రోతలకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాము.... గుక్కపట్టి ఏడుస్తున్నాము."

"ఛూత్.... నీయవ్వ.... లెగరాపోదాం" అని లేచాడు హెడ్డు·రైటర్ అయోమయంగా వెంట నడిచాడు.

తొమ్మిదో రోజు

ఫోను మోగింది. ఎస్సై ఫోనెత్తాడు. ట్రాఫిక్ కానిస్టేబుల్ ఫోన్ చేశాడు.

"సార్ ఒక కేసు పట్టుకున్నాను సార్"

"వెరీగుడ్· కేసేమిటి?"

"నేను డ్యూటీ చేస్తుంటే నా యూనిఫారాన్ని అవమానించాడండీ."

"యూనిఫారాన్ని అవమానించడమంటే సీరియస్ కేసే. వెంటనే వాణ్ణి తీసుకురా."

"ఎస్ సార్. ఇప్పుడే ఎత్తుకొస్తాను" అని అవతల ఫోన్ పెట్టేశాడు.

వీడెప్పుడూ ఇంతే. తీసుకొస్తాను అనటానికి ఎత్తుకొస్తాను అంటాడు. దొంగల ముఠాలో పన్చేసేవాడిలాగా. ఎస్సై విసుక్కున్నాడు.

పది నిమిషాల తర్వాత దూరంగా గేటులోంచి లోపలికొస్తూ కనిపించాడు.చంకలో ఆరేళ్ళ కుర్రాడున్నాడు. వాణ్ణి యెత్తుకుని లోపలికి వచ్చాడు.

"ఏడీ నేరస్తుడు?" ఎస్సై అనుమానంగా అడిగాడు.

"వీడే సార్. బాల నేరస్తుడు."

"ఏం చేశాడు?" ఎస్సై అసహనంగా అడిగాడు.

"నేను సెంటర్లో నుంచుని డ్యూటీ చేస్తూంటే ఈ కుర్ర సన్నాసి నోట్లో బీడీ పెట్టుకుని బడికెడుతున్నాడు సార్. నేను వీడ్ని పిలిచి

"తప్పమ్మా. అలా పెద్దవాళ్ళలాగా బీడీలు కాల్చకూడదు" అని మందలించాను సార్. అప్పుడు వీడు నన్ను వెక్కిరించి "నువ్వు చిన్నపిల్లాడిలాగా నిక్కరేసుకున్నావేంటి? పైగా ఆ నిక్కరుతో ఎత్తుగా దిమ్మమీద నిలబడతావా! సిగ్గు లేదూ?" అని పారిపోతుంటే పట్టుకున్నాన్సార్" అని వివరించాడు.

ఎస్సై తల పట్టుకున్నాడు. కుర్రాణ్ని చూస్తే తాపీగా ఏదో నములుతున్నాడు.

"ఏమిటది నోట్లో?"

"తేగ సార్. ఏడుస్తూంటే నేనే కొని పెట్టాను."

"అలాగే ఓ రూపాయిపెట్టి చాక్లెట్లు కూడా కొనిపెట్టి. స్కూల్దగ్గర దింపేయ్ యూ ఫూల్!" గట్టిగా అర్చాడు.

అల్లావుదీన్—

అద్భుత గ్యాసు సిలిండరు కథ

ఇదిలా వుండగా ఈ మధ్య ఒక పుకారు చెలరేగింది. నగరంలో విడుదల చేసిన గ్యాసు సిలిండర్లలో ఒక అద్భుత సిలిండరు వుందని. అది కలిగి వున్నవాళ్ళకి తీరని కోరికంటూ వుండదని. అది విన్న ప్రతివాళ్ళూ ఆశతో సిలిండర్ని చింతపండువేసి తళతళా మెరిసేలా తోముతున్నారట! కానీ ఏ భూతమూ ప్రత్యక్షమవటల్లేదని నిరుత్సాహపడుతున్నారు.

అంతేకాక రాత్రిపూట వీథుల్లో 'పాత సిలిండర్లకు కొత్త సిలిండర్లిస్తాం' అనే కేక అప్పుడప్పుడూ వినిపిస్తోందని కొంతమంది ప్రజలు చెప్పుకుని భయపడుతూంటె పోలీసులు దర్యాప్తుచేసి. బవిరి గెడ్డం, జుట్టు వున్న భయంకరాకారుణ్ణి, వ్రేలాడుతున్న జోలెతోసహా పటుకున్నారు అనుమానంమీద.

నువ్వు మంత్రగాడివా! ఎవరికి చేతబడి చేస్తున్నావు అని నాలుగు తగలనిచ్చారు. వాడు గోలపెడుతూ తాను మంత్రగాడు కాదని, తనే అల్లావుద్దీన్ అనీ చెప్పాడు.

"లట్—నువ్వు అల్లావుద్దీన్‌వి కాదు మాంత్రికుడివే. పైగా పాత సిలిండర్లకు కొత్త సిలిండర్లిస్తాం అంటూ అరుస్తున్నావు కూడాను" అని బొక్కలోకి తోశారు

తర్వాత గ్యాసుడీలర్ల ప్రతినిధి రహస్యంగా డీఐజీ ఎస్పీని కలుసుకుని వాడి పేరు అలావుద్దీన్ అన్నమాట నిజమేనని, వాణ్ణి తామే అలా వూళ్లో తిరగమన్నామనీ చెప్పాట్ట. డీవై ఎస్పీ ఏమిటిదని గట్టిగా అడిగితే, ఆపుకారు పుటించింది తామేనని. మరీ బొత్తిగా సిలిండర్లు అంగుళంమందం మడ్డితో కంపెనీకి చేరుతున్నై అని. ఈ పుకారువల్ల అవి తళతళలాడేలాగా తయారవుతాయనే వుద్దేశంతో ఇలా చేయడం జరిగిందనీ చెప్పి మన్నించమని అడిగితే డీవైఎస్పీ క్షమించి యింకెప్పుడూ యిలా పుకార్లను స్ప్రెడ్ చేయొద్దనీ. అంతా నమ్మి మోసపోయే అవకాశం వుందనీ. మందలించి. అల్లావుద్దీన్ని కూడా విడిపించాట్ట.

ఆ ప్రతినిధి వెళ్ళిన వెంటనే అయ్యగారు వంటింట్లోకి వచ్చి వెంటనే కాస్త నూనె మడ్డిని సిలిండరుకి పట్టించమని ఆర్డరు వేసి హడావుడిగా ఏదో మీటింగుకి వెళ్ళిపోయాడని వంటవాడు మాలికి చెపుంటే విన్నామని అక్కడక్కడా అనుకున్నారు.

పదకొండో రోజు

"ఫాల్స్ కేసులు పెడదామన్నా కుదిరి చావటల్లేదు. కంప్లెయింట్ చేసే వాడెవడూ? పైగా ఫాల్స్ కేసులుపెటి యెలాగో రిజిషర్ నింపుదామని చూస్తే వూరుకోను జాగ్రత్త అని డిఐజి గారినుంచీ సర్క్యులర్ వచ్చినప్పట్నుంచీ యింకా యిరకాటంలో పడ్డాం." ఒక ఎస్సై అన్నాడు.

"అక్కడికీ మొన్న యిద్దరు కేడీలని బతిమాలి యెలాగోలా కొట్టుకు చావండిరా నాయనా అని అడిగితే "మీరు మనిషికి వందిచ్చినా కొటుకు చావం" అని మొండికేస్తున్నారు· పది రూపాయలకి ప్రాణాలుతీసే నా కొడుకులు మనల్నియిలా ఏడిపిస్తున్నారు" -ఇంకో ఎస్సై చిరాగ్గా అన్నాడు.

సబ్ ఇన్‌స్పెక్టర్లందరూ ఒకచోట సమావేశమయ్యారు. మునుపటి పరిస్థితి పునరుద్ధరించకపోతే ఉద్యోగాలు నిలవవేమోనన్న ఆందోళన వాళ్ళ మొహాల్లో ప్రతిఫలిస్తోంది.

"ఇక ఒకటే మార్గం వుంది." నిట్టూర్చాడు ఒక వృద్ధ ఎస్సై.

"ఏమిటి?" ఆతృతగా అడిగారు అందరూ.

మన కాన్‌స్టేబుల్స్‌నే. డ్యూటీ దిగాక వాళ్ళ పక్కింట్లో ఏదో ఒక దొంగతనం చెయ్యమని చెప్పటమే. ఆ ఇంటిగలవాళ్ళు ఫలానా వస్తువు పోయిందని కంప్లెయింట్ చేస్తారుగదా! అలా కేసు రిజిషర్ చేసి. కొంతకాలం తాత్సారం చేయొచ్చు. ఆ తర్వాత ఎవళ్ళ వస్తువులు వాళ్ళకిచ్చేసి దొంగ దొరకలేదని. వస్తువులు మాత్రం దొరికాయని చెప్తే సరిపోతుంది. పోయిన వసువులు దొరికాయని వాళ్ళు సంతోషపడతారుగానీ దొంగ దొరికాడా లేదా అన్నది ఎవరూ పట్టించుకోరు సామాన్యంగా"

అందరికీ బాగుందనిపించింది ఈ పద్ధతి.

పన్నెండో రోజు

నగరంలోని ఎస్సైలలోకెల్లా కురువృద్ధుడైన షేక్ ఆలీబాబాని తాత్కాలిక అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. ఎస్సైల సంఘం. ఆయన జాగ్రత్తగా ఆలోచించి, కాస్త సమర్థులైన నలభైమంది కాన్‌స్టేబుళ్ళని ఎంపికచేశాడు. వాళ్ళను రాత్రికి రాత్రే నలుమూలలకీ పంపించాడు ఎలాగో ఒకలా దొంగతనం చేసిగానీ స్టేషన్‌కి రావద్దన్నాడు యూనిఫాంలో వుండగా మాత్రం పిచ్చిపనులు చెయ్యొద్దన్నాడు.

వాళ్ళు కాస్త ఇబ్బందిగానే బయల్దేరి వెళ్ళారు.

చెమ్చా దగ్గర్నుంచి రేడియో దాకా ఏదైనాసరే దొంగిలించచున్నాడు. దొంగిలించిన వస్తువులు పడెయ్యటానికి ఒక గోడౌన్ ని యెన్నుకున్నాడు.

పొద్దున్నే వచ్చాడు ఒక కాన్‌స్టేబుల్. మనిషి నీరసంగా కనిపించాడు. మానసికంగా చాలా స్ట్రగుల్ అయినట్లుంది అతని మొహం చూస్తే.

"ఏమయింది? ఏం దొంగిలించావు?" ఆవ(టాని అడిగాడు ఎస్సై. అతను చెప్పిన సమాధానం వింటే ఆయనకి మతి పోయినట్లయింది.

"ఏమీ లేదు సార్. యూనిఫాంలో వున్నంతసేపూ యెలాగో ఒకలా నేరంచేసి మన డిపార్టుమెంటుకి సేవ చేద్దామనే అనుకున్నాను: కాని యెప్పుడైతే యింటికెళ్ళి యూనిఫాం విప్పేసి మామూలు సివిల్ డ్రెస్ వేసుకున్నానో లేదో వెంటనే నా మనసుని ఒక విధమైన ప్రశాంతత ఆవహించింది. సార్. కనీసం ప్రక్కింటాళ్ళ చెట్టుమీంచి కరేపాకు కోద్దామన్నా చేతులు రాలేదు సార్" అన్నాడు.

తతిమ్మా దొంగలంతా (పోలీసులంతా) కూడా దాదాపు అదేసమాధానం చెప్పారు.

ఆలీబాబా ఆలోచిస్తున్నాడు. యూనిఫాంలో వుండగానే దొంగతనం చెయ్యమని చెప్పడం కంటే ఉరేసుకు చావటం మంచిది.

దొంగల్ని లెక్కపెట్టాడు. ముప్పై తొమ్మిదిమందే వున్నారు. నలభయ్యో దొంగమీద ఆశలు పెంచుకున్నారందరూ.

కాస్సేపట్లో వచ్చేశాడు నలభయ్యో దొంగ. ఎగరుస్తూ వరిగెత్తుకుంటూ వచ్చాడు పోలీసులు తరుముతున్నట్టు.

రాంగానే ఓ స్టీలు గిన్నె తీసి టేబుల్ మీద పెట్టాడు.

ఆలీబాబా ఆశ్చర్యపోయాడు. ఈ లెక్కన ఇతను యూనిఫాంలో వుండే దొంగతనం చేశాడా? నిన్ననే ట్రాన్స్‌ఫర్ అయి ఈ వూరొచ్చాడు.

"నేను యూనిఫాంలో వుండగా చెయ్యలేదు సార్. సివిల్ డ్రెస్‌లో మా పెరట్లో తిరుగుతూంటే కాకి ఒకటి ఈ గిన్నె మా పెరట్లో పడేసింది. అది ఎవరిదో వాళ్ళకిచ్చేద్దామన్న ఉద్దేశ్యంతోనే ఒంగి తీసుకున్నాను సార్ కానీ, ఇంట్లోకెళ్ళి యూనిఫాం వేసుకోగానే నేరంచేయాలి అనే నా కర్తవ్యం గుర్తొచ్చింది. వెంటనే పరిగెత్తుకుంటూ ఇలా వచ్చేశాను సార్." అని చెప్పాడు.

ఆలీబాబా ఆలోచించాడు. ఇందులో అతని తప్పేంలేదు. తప్పల్లా ఆ సివిల్ డ్రస్సుది. అంతే అనుకుని గిన్నె పరీక్షగా చూశాడు. నేతి గిన్నె. యెంత స్టీలుదైతే మాత్రం యెవడు కంప్లెయింట్ చేస్తాడు అనుకుంటూ చూస్తే గిన్నె వెనకాల యస్. ఎ. అని అక్షరాలు కనిపించాయి. "అరే యిది మాదే" అన్నాడు బిగ్గరగా. అతన్ని అడిగితే ఆలీబాబా యింటికి ప్రక్కనందులోనే ఇతను దిగినట్టు తెలిసింది.

పదమూడో రోజు నుంచి

"ఈ రోజు పబ్లిక్ మీటింగులో మాట్లాడవలసిన స్పీచి తయారు చేశావా?" సూట్లు, కేసులు శాఖ ఉపమంత్రి అడిగాడు పీయేని.

"పది రోజుల క్రితమే తయారుచేసి ఉంచానండీ" పి.యే చెప్పాడు.

"అదా? ఆ స్పీచి లాభం లేదయ్యా. దాన్లో ప్రజలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని, నేరాలు చెయ్యకూడదని రాశాం గదా? అది కొట్టేసి, అతి త్వరలో కొద్దో గొప్పో నేరాలుచేసి పోలీసు శాఖని సంక్షోభంలో పడకుండా కాపాడమని ప్రజలకు విన్నవిస్తున్నట్టు రాయి. మొన్న పోలీసు కాన్ఫరెన్సులో పాపం ఆళ్ళిదే గోల పెట్టారు. ఆళ్ళు ఆళ్ళనోటితో సెప్ప కూడదుగదా? నేనైతే మంత్రిని కాబట్టి ఏమైనా సెప్పొచ్చు. ఒకవేళ నే సెప్పిందాన్లో ఏమైనా అభ్యంతరమున్నా వెంటనే, నిన్న సెప్పింది ఇయ్యాళ ఉపసంహరించుకుంటున్నాను. అని ఓ స్టేట్‌మెంట్ పడేస్తే పోయే!" సూటుకేసుల శాఖ ఉపమంత్రి చిరునవ్వు నవ్వాడు.

దినపత్రికలు, వారపత్రికలు. కొమ్ములు తిరిగిన మాసపత్రికలు ఒకే మాసపత్రికలుగా (మాక్కామిస్తే మూ) ఇంచుమించు ఒకే రకమైన సంపాదకీయాన్ని ఘాటుగా రాశాయి.

* * *

"నారాయణ.... నారాయణ" అంటూ వచ్చాడు నారదుడు.

"ఏం నారదా? ఏమిటి విశేషాలు?" చిరునవ్వుతో ప్రశ్నించాడు విష్ణుమూర్తి. లక్ష్మి ఆయన కాళ్ళొత్తుతూ నారదుణ్ణి కుశలం అడిగింది.

"ఏం చెప్పమంటావు శ్రీహరీ? సర్వజ్ఞుడివైన నీకు తెలీనిది ఏముంది? భారత దేశంలో అలజడిగా వుంది. ఎక్కడపడితే అక్కడ క్షేమం తాండవిస్తోంది. ధర్మం బొత్తిగా నాలుగు పాదాలమీద నడుస్తోంది. అటు దేవేంద్ర లోకంలోకూడా ఈ విషయమై అలజడిగా వుంది. ఈ సారి తన సింహాసనానికి లక్షలకొలదీ ఇంద్రులు పోటీకి వస్తారేమో అని హడలిపోతున్నాడు ఇంద్రుడు. అవసరమైతే రంభ, ఊర్వశి, తిలోత్తమాది అప్సరసలను సైతం భారత దేశానికి పంపి ప్రజలను కామాతురులుగా నూ, స్త్రీ మూలంగా వాకరి నాకరు ద్వేషించుకునే లాగు చేయాలని ఆత్రుతపడుతున్నాడు దేవేంద్రుడు. గత పన్నెండు రోజులుగా యమ


నెలకు రు. 1000/-లు
సంపాదించండి

ఫొటోగ్రఫీటీచర్ రు.10/-; డ్రాయింగ్ & పెయింటింగ్ గైడ్ రు. 10/-; ట్రాన్సిస్టరు రేడియో గైడ్ రు. 10/-; రేడియో గైడ్ రు. 10/-; వివాహపు జీవితం 100 బొమ్మలతో రు.10/- మెడికల్ సెక్స్‌గైడ్ 88 బొమ్మలతోరు.10/-; టైలరింగ్ & కటింగ్ గైడ్ రు. 10/- 300 కుటీరపరిశ్రమ గైడు రు.20/-; ఎలక్ట్రిక్ గైడు రు. 10/- 350 ఎంబ్రాయిడరీ డిజైన్సు రు. 8/- ప్రతి ఒక్కటి పోస్టేజి 1-50

ILFA BOOK DEPOT (25A)
ALIGARH (U.P.)

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి Address :

Samaj Kalyan (R.L. 78)
(P. o) Katri Sarai (Gaya)

డా. పి వి. కె. రావ్, B.A. సెక్స్ స్పెషలిస్ట్



వైద్య విద్వాన్ — వైద్యాచార్య హస్తప్రయోగం, నరముల బలహీనత, అంగము చిన్నదగుట, శీఘ్రస్కలనము, శుక్లనష్టము ఇతరరోగములకు, మానసిక వ్యాధులకు శాస్త్రీయ చికిత్స పోస్టుద్వారాకూడాచికిత్సగలదు.

రావూస్ క్లినిక్,
టి.బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700.

లోకం కూడా ఖాళీగా వుంది. ఎవరో అక్కడక్కడా పాత కాపుల్లాంటి పాత పాపులు తప్పితే. క్రొత్త పాపులెవరూ వచ్చుటలేదు."

బయట కోలాహలం వినిపించింది. జయవిజయులు లోపలకు జొరబడటానికి ప్రయత్నిసున్న ఋషులను. బ్రహ్మాది దేవతలను అడ్డగించటానికి బ్రహ్మ ప్రయత్నం చేస్తున్నారు.

విష్ణుమూర్తి లేచి కూర్చుని వాళ్ళని లోనికి రావటానికి అనుజ్ఞ ఇచ్చాడు. వెంటనే దేవతలూ, ఋషులూ పరుగు పరుగున వచ్చి, విష్ణుమూర్తిని వేనోళ్ళ స్తుతించారు.

"దేవదేవా! నారాయణా, ఆపద్బాంధవా లక్ష్మీపతీ, భూలోకం మరీ పుణ్యపంకిలం అయిపోతోంది. ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా పుంచివారు సంచరిస్తున్నారు. అధర్మాన్ని ఖూనీచేస్తున్నారు. యజ్ఞ యాగాదులు సక్రమంగా నిర్వహించబడుతున్నై. నీవు పూనుకోకపోతే కలియుగంలో ధర్మం ఎక్కడపడితే అక్కడ వికటాట్టహాసం చేస్తుంది" అని మొర పెట్టుకున్నారు.

ఇదంతా శివుని వరప్రభావంవల్ల జరిగిన అకృత్యమని గ్రహించి రెండు మూడు రోజుల్లోనే తాను దీనికి తప్పక తరుణోపాయం ఆలోచిస్తానని అభయమిచ్చి అందర్నీ పంపివేశాడు విష్ణుమూర్తి.

* * *

ప్రపంచం నలుమూలలనుంచీ టెలిగ్రాములు. సందేశాలు వచ్చాయి.

అతిత్వరలో మీ దేశంలో నేరాలు పునరుద్ధరింపబడి, ఇండియా అంతర్జాతీయంగా తన ప్రతిష్ఠను నిలుపుకో గలదని ఆశిస్తాను.

— అమెరికా అధ్యక్షుని సందేశం.

ఇది వాళ్ళ ఆంతరంగిక విషయం. దీనిపై నేనేమి వ్యాఖ్యానించను.

—పాకిస్తాన్ అధ్యక్షుడు.

ఇలా మా దేశంలో నేరాలు లేకపోవటం మేం యెరగం బాబూ అని కొన్ని దేశాలు ముసిముసిగా నవ్వుకున్నై.

ప్రస్తుత పరిస్థితిని సమీక్షించి అతిత్వరలో భారతదేశం అణు ప్రయోజనాలకు శాంతియుత పద్ధతి ప్రాతిపదికపై వర్ధమాన దేశాలతో రాజీపడటానికి ప్రయత్నిస్తుందనటంలో సందేహంలేదు.

—చైనా

ఏది ఏమైనా. అంతర్జాతీయంగా ఈ విషయమై ఎంత వత్తిడి వచ్చినా మన దేశం అలీన విధానానికే కట్టుబడి వుంటుందని హామీ ఇస్తున్నాను - భారత ప్రధాని గంభీరంగా ప్రకటించారు.

... దేశంలో నేరాలు లేకపోటానికి. దేశాలమధ్య మారకద్రవ్యం విలువ ఏటి సంబంధం లేదని మేము సంయుంగా తీర్మానించడమైంది.

—క్యూబా. గినియా

నేను అనుసరిసున్న ప్రకృతి చికిత్సా విధానాలే ఈ సంక్షోభానికి కారణం అని ఎవరో దురుసుగా ఆరోపణచేస్తే ఖండించవలసిన బాధ్యత నా పార్టీ సభ్యులకు లేదా?

- మాజీ ప్రధాని అభిభాషణ.

ఇండియాలో ఎంత అల్లకల్లోల పరిస్థితి ఉత్పన్నమయితేమాత్రం. సెవెంత్ ఫ్లీట్ అ పరిసరాల్లో సంచరించడానికి ఉద్దేశింపబడటం గర్హనీయంగా పేర్కొనక తప్పదు.

-ప్రావ్దా.

* * *

"ఇందాక భూదేవి వచ్చింది మన కొండకి" తల వంచుకుని ఓరగా శివుని చూస్తూ చెప్పింది పార్వతి.

"ఆహా.... ఎందుకు వచ్చిందిట?" చిరునవ్వు దాచుకుంటూ అడిగాడు శివుడు.

"ఒళ్ళంతా సెగలు కమ్ముతోందట. ఈ వేడి భరించలేను బాబోయ్ అని మొర పెటుకుంది"

"మనకి వచ్చి చెప్తే మనమేం చేస్తామట?" అన్నాడు శివుడు.

"అలా అంటే సరిపోతుందా? నేను మాటిచ్చాను" అలుకగా అంది పార్వతి.

"ఏమని మాటిచ్చావు?" చిరునవ్వుతో అడిగాడు శివుడు.

పార్వతి కాస్త తత్తరపడింది.... "అదే... భూలోకంలో ఎప్పటివలెనే పరిస్థితి మామూలుగా వుంటుందని...."

శివుడు పార్వతిని చూసి గంభీరంగా చెప్పాడు.

"చూడు పార్వతీ! ఏదీ ఎప్పుడూ అంతా సవ్యంగా జరగదు. జరగకూడదు. సృష్టి వున్నప్పుడు లయా ఉండక తప్పదు. న్యాయం ప్రక్కన అన్యాయం వుంటేనే న్యాయం అనే మాటకు ఒక అర్థం, రాణింపు.

"విష్ణువు చేతిలో చక్రం, గదా లేకపోయినా, నాకు త్రిశూలం, మూడోకన్ను లేకపోయినా. మా విలువేమిటి చెప్పు?

"నేను మన్మథుణ్ణి. బూడిద చెయ్యడం లాటి అరుదైన విషయాల్లో తప్పించి, ఎప్పుడైనా మూడో కన్నును తెరిచానా? అది మూసి వుంచితేనే అందరూ భయభక్తులతో వుంటారు. వుందిగదా అని చీటికిమాటికీ తెరిచి నా ప్రతాపం చూపించాలని సరదాపడితే ఎవరూ లక్ష్యపెట్టరు నన్ను.

"నేరాలు జరుగుతూనేవుంటయ్యి నాటిని అదుపు చేసే పోలీసు యంత్రాంగం అధికార దుర్వినియోగం చెయ్యకుండా జాగ్రత్తగా వ్యవహరించి సామాజిక వ్యవస్థని కాపాడాలి. అప్పుడే సామాన్య ప్రజ నిర్భీతిగా మనగలుగుతుంది. లేకపోతే వారిలో తిరుగుబాటు ధోరణి చెలరేగే ప్రమాదం వుంటుంది.

"అంతే కాదు. ప్రతిమనిషిలోనూ అంతర్గతంగా మూడోకన్ను వుంటుంది. దాన్ని బలవంతాన తెరిపించాలని చూస్తే దేశ వ్యవస్థ దారుణంగా సంక్షోభంలో పడుతుంది. అంతటి ప్రమాదం జరగకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వానిది.

"సరదాకికూడా మనిషి మూడో కంటితో ఆటలాడుకోవటం. రెచ్చగొట్టటం మంచిది కాదు."

పార్వతి దీనంగా చూసింది." ఇప్పుడు తరుణోపాయం ఏమిటి స్వామీ?" శివుడు చిరునవ్వు నవ్వాడు. "నేను పెట్టిన పదిహేనురోజుల గడువు ఈ రోజుతో తీరిపోయిందని మర్చిపోయావా దేవీ? దేవతల మొర ఆలకించి. విష్ణువు ఏంచేస్తాడో చూద్దాం." అని భూలోకంవైపు దృష్టి సారించాడు.

విష్ణువు తన అంశను భూలోకానికి పంపాడు.

వెంటనే సగం కాకీ డ్రెస్సు. సగం సివిల్ డ్రెస్సు వేసుకున్న ఒక ఆజానుబాహువు నరసింహమూర్తిలాగా ఉగ్రంగా ఎక్కడపడితే అక్కడ ప్రత్యక్షమై దారుణాలు చేయసాగాడు. రాళ్ళు తీసుకుని షోకేసుల అద్దాల పగలగొట్టాడు. ఒకటి రెండు బస్సులకు నిప్పంటించాడు. రైలు ట్రాకుకి అడ్డంగా పెద్దపెద్ద మానులు. కట్టెల మోపులు పెట్టాడు. అలా కొద్దిసేపు వీరవిహారం చేసి మాయమయిపోయాడు.

వెనువెంటనే పోలీసువాన్లు, ఫైరింజన్లు కదిలాయి. ప్రజలలో పూర్వపు దౌర్జన్యోత్సాహం పుంజుకుంది. పోలీసు స్టేషనలో కేసులు చకచకా రిజిష్టరు కాసాగాయి. రైటర్లకు పెన్ను నిండా పని తగిలింది. ఎస్సైలు. సి ఐలు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసు అధికారులు. ప్రభుత్వాధికారులు గుండెలమీద చెయ్యేసుకుని అమ్మయ్య అనుకున్నారు. వాళ్ళందరికీ ఆ రోజు హాయిగా నిద్ర పట్టింది. చేపల మార్కెట్లో పసుకునేవాడికి పూల మార్కెట్లో నిమిషం కూడా నిద్రపట్టనట్లుగా వుంది వాళ్ళకి ఈ పదిహేను రోజులూ.

దేశంలో ఎప్పటివలెనే అశాంతి భద్రతలు నెలకొన్నై, పార్వతి సంతోషించింది.

★